

## జర్నలిస్టుల అక్రిడేషన్ గడువు పొడిగింపు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు మార్చి 1, 2025 నుండి మే 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీచేస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, ఐఏఎస్, గారు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఫిబ్రవరి 28, 2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 1, 2025 నుండి మే 31, 2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని, సంబంధిత మీడియా యాజమాన్యం వారు వారి సంస్థలో పని చేయుచున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, తిరుపతి వారి కార్యాలయంలో వీలైనంత తొందరగా అందచేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలియజేశారు.

# 'విజన్' బడ్జెట్‌పై... 'ఆశ'లెన్నో..!

### ప్రాజెక్టులు పూర్తయ్యేనా..?

### సూపర్‌సిక్స్‌కు కేటాయిస్తారా?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజానీకానికి అనేక హామీలు ఇచ్చిన నేపథ్యంలో, అవన్నీ నెరవేరేలా బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని ప్రజలు ఊహిస్తున్నారు. ముఖ్యంగా సూపర్‌సిక్స్ పథకంలో ఇప్పటివరకూ ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ తప్ప, మిగిలిన ఐదు పెండింగ్‌లోనే ఉన్నాయి. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పేరుతో రూ.15వేలు ఇస్తామని ప్రకటించారు. తాజాగా జరిగిన క్యాబినెట్‌లో మే నెలలో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 69.16 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తిరుపతి జిల్లాలో 13 లక్షల 26 మంది ఉన్నారు. మహిళలకు 1500 చొప్పున నెలకు ఇస్తామన్న హామీ కూడా పెండింగ్‌లోనే ఉంది. అన్నదాత సుఖీభవ కింద 20వేల రూపాయలు అకౌంట్‌లో వేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 53.58 లక్షల మంది ఉన్నారు. తిరుపతి జిల్లాలో 5 లక్షల 75వేల 78 మంది రైతులు లబ్దిదారులుగా ఉన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి 3వేల హామీలూ పెండింగ్ ఉన్నాయి. బీసీలకు 50ఏళ్లు దాటితే పింఛన్ ఇస్తామని చెప్పిన హామీ కూడా అమల్లోకి రాలేదు. విజన్ 2047 ఆధారంగా తమ అభివృద్ధి ఉంటుందని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ దిశగానే అంకెలగారడీ చేసే అవకాశం లేకపోలేదు.

జిల్లాలో మేజర్ ప్రాజెక్టులు గత పదేళ్లుగా నిధులు లేక, అటవీ శాఖ అనుమతులు రాక పెండింగ్‌లోనే ఉన్నాయి. మధ్యతరగతి మల్లిమడుగు, కాళంగి, కల్యాణి, కృష్ణాపురం డ్యాంలు ఉన్నాయి. మేజర్ ప్రాజెక్టులైన అరణియార్, తెలుగుగంగ, సోమశిల స్వర్ణముఖి, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులకు గత బడ్జెట్‌లో పైసా విదల్చలేదు. రాష్ట్ర నీటివనరుల శాఖ మంత్రి నిమ్మకాయల రామానాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు పూర్తవ్వాలంటే ఈ బడ్జెట్‌లో రూ.32వేల కోట్లు కేటాయించాలని ఆర్థిక మంత్రిని కోరారు. అయితే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో తాత్కాలికంగా సర్దుకోవాలని, ప్రస్తుతానికి ఈ బడ్జెట్‌లో 21వేల కోట్లు ప్రాజెక్టులకు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవులు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తెలుగుగంగ, సోమశిల స్వర్ణముఖి ప్రాజెక్టులకు పైసా వచ్చే పరిస్థితి లేదని సమాచారం. హంద్రీనీవా, గాలేరునగరి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో 4,500 కోట్లు కేటాయించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎస్వీ, పద్మావతి, వెటర్నరీ, అగ్రికల్చర్, ద్రావిడ యూనివర్సిటీలు నిధుల లేమితో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. పరిశోధనలకు నిధులు కేటాయించకపోవడం వల్ల గత రెండేళ్లుగా విశ్వ విద్యాలయాల్లోపరిశోధనలు అటకెక్కి ఉన్నాయి. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలకు నిధులు కేటాయించే అవకాశం ఉందని మేధావులు చెబుతున్నారు. సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వనున్నటు ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.






సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ

## రేపు చంద్రబాబు జీడీనెల్లూరుకు రాక

### సామాజిక పింఛన్ల పంపిణీ, బహిరంగసభ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్చి 1వ తేదీ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గ కేంద్రానికి రానున్నారు. ఒకటో తేదీ ఉదయం 10.40 గంటలకు విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడనుంచి హెలికాప్టర్‌లో 11.35 గంటలకు 11.50కి జీడీనెల్లూరు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12 గంటలకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 12.10 గంటలకు లబ్దిదారుల గృహాలను పరిశీలిస్తారు. 12.40 గంటలకు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 1.30 గంటలకు బహిరంగసభలో పాల్గొంటారు. 2.30 గంటలకు గ్రామస్తులతో మాటామంతీలో పాల్గొంటారు. 3.15 గంటలకు బయల్దేరి విజయవాడకు వెళతారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్‌పి మణికంఠ చందోలు జీడీనెల్లూరు హరిజనవాడ సభాస్థలి, రామానాయుడుపల్లిలో హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ముందస్తు బందోబస్తుపై దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోనున్న నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నే, ఏఎస్పీ లు శ్రీనివాస రావు, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్‌ఓ బాలాజీ నాయక్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

### 3న 'రాక్ మన్ ప్లాంట్' ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్


ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్చి 3న రాక్ మన్ ప్లాంట్ పాగలి నందు గ్రీన్ హైడ్రోజన్ యూనిట్ ను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారని, ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ జెసి శుభం బన్సల్ తో కలిసి గురువారం ఉదయం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. మార్చి3 న సోమవారం ఉదయం 10.20 గంటలకు సదరు హీరో గ్రూప్స్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారని, అందుకు సంబంధించి పాగలి రాక్ మన్ ప్లాంట్ నందు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. పెండాల్ ఏర్పాటు, వీడియో కాన్ఫరెన్స్ పరికరాల ఏర్పాటు,సీటింగ్, విద్యుత్తు ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, విధులు కేటాయించబడిన అధికారులు అత్యంత బాధ్యతగా హాజరుకావాలని ఆదేశించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ విజయ్ భరత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మారుతి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య, తాసిల్దార్ ఏర్పేడు భార్గవి తదితరులు రాక్ మన్ ప్లాంట్ నందు సిఎం వర్చువల్ ప్రారంభోత్సవ స్థల పరిశీలన చేసి సంబంధిత అధికారులకు, ప్లాంట్ వారికి పలు సూచనలు చేశారు.

## తెలుగు భాషాభ్యున్నతికి నిరంతర ప్రణాళికలు

ప్రజాశక్తి - క్యాంపస్

ప్రపంచంలోనే ప్రముఖమైన భాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, అందులో తెలుగు భాష ప్రాముఖ్యత రోజురోజుకూ తగ్గిపోతుందని, తెలుగు భాషను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగు భాషాభివద్ధికి సమష్టి కషి చేయవలసిన అవసరం ఉందని వక్తలు ఉద్ఘాటించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ – ప్రాచ్య పరిశోధనా సంస్థ – తెలుగు సంపద, బెంగళూరు సంయుక్తంగా నిర్వహించిన మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు తిరుపతిలో ఎస్వీయూ సెనేట్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం వేదికగా ఇటువంటి గొప్ప సదస్సు నిర్వహించుకోవడం మంచి పరిణామమని, భారతీయ భాషల్లో తెలుగు విశిష్టతను కలిగిందని అన్నారు. తెలుగుదనం తగ్గి, ఆంగ్లత్వ పోకడలు సినిమా, మీడియాలో పెరిగాయని వాటిపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా సాహిత్య రంగాలపై విస్తత పరిశోధనలు సాగాయని తెలిపారు. పూర్వ శాసన మండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విదేశీ భాషల పట్ల వ్యామోహం పెరుగుతూ ఉందన్నారు. తెలుగు భాష అంతరిస్తూ ఉందనే విషయం సత్య దూరమైనదని చెప్పారు. ప్రపంచ సాహిత్య ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోని తెలుగు రచనలు ఉన్నాయని అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల, గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ఇందుకు నిదర్శనమని వివరించారు. తెలుగులో కథకు ఇప్పటికీ ఆదరణ ఎక్కువగా ఉందన్నారు. వారానికి సుమారు వంద కొత్త కథలు పత్రికల్లో ప్రచురితమవుతున్నాయని తెలిపారు. కీలకోపన్యాసం చేసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బోధన, అధికారిక కార్యకలాపాల్లో తెలుగు ప్రాధాన్యం పెరగాలన్నారు. భాషా సంబంధ పరిశోధనలు విశ్వవిద్యాలయాల్లో మరింతగా సాగాలని కోరుకున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన శాశ్వత పరిష్కారం కాదని , డిగ్రీలో ఒక సంవత్సరం మాత్రమే తెలుగు చదువుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషా పరిశోధకులు స.వెం. రమేశ్ మాట్లాడుతూ తెలుగు సమాజానికి వెలుపల తెలుగు భాష వివిధ కళా రూపాలు, ఆచారాలూ సంప్రదాయాల రూపంలో కనిపిస్తుందన్నారు. తమిళనాడు, శ్రీలంక వంటి మిగతా రాష్ట్రాల్లోనూ, మిగతా దేశాల్లోనూ తెలుగు వెలుగు కనబడుతూ ఉందన్నారు. అసలైన తెలుగు భాషా సంపద ఇదేనని తెలిపారు. శ్రీ కష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథ శర్మ మాట్లాడుతూ ధారణ శక్తి వల్ల చురుగ్గా ఆలోచిస్తారని, తెలుగు పద్యాలు అలాంటి ధారణకు సహకరిస్తాయని తెలిపారు. సదస్సులో భాగంగా అన్నమయ్య భవన్ తిరుపతి ఆర్ట్ సొసైటీ వారు 30 మంది చిత్రకారులతో రూపొందించిన 100 వందకు పైగా చిత్రాలను ప్రదర్శించారు. అందరినీ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని సదస్సు సంచాలకులు ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు డాక్టర్ రేమిళ్ళ మూర్తి నిర్వహించారు.



## ఉచిత శస్త్ర చికిత్సలకు 142 మంది ఎంపిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ బాలాజీ ప్రాణదాన ట్రస్ట్ కింద స్విమ్స్ లో ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు 142 మంది పేద రోగులను ఎంపిక చేసినట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ తెలిపారు. స్థానిక స్విమ్స్ కమిటీ హాల్లో గురువారం ప్రాణదాన కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ 142 మంది పేద రోగులను ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడం జరిగింది. పేషంట్ల ఆరోగ్య స్థితిగతులను, బియ్యం కార్డు కలిగి దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న నిరుపేదలను వారి అర్హతలను బట్టి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి వివిధ విభాగాల క్రింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. మెడిసిన్ విభాగంలో 24 మంది, ఇ.ఎన్.టి. -01. గైనకాలజి -01, జనరల్ సర్జరి -05, కార్డియాలజీ -03, న్యూరో సర్జరీ- 15, కార్డియో థొరాసిక్ 12, మెడికల్ అంకాలజీ 03, నెప్రాలజీ-44, న్యూరాలజీ-18, గ్యాస్ట్రో ఎంట్రాలజి -14 సర్జికల్ అంకాలజీ- 02 మొత్తం -142 మంది పేషెంట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్. ఆర్ఎంఓ డాక్టర్ కోటి రెడ్డి, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ డి.గోపి. టిటిడి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.బి.నర్మాద పాల్గొన్నారు.

## ఎస్వీయూ దూరవిద్యకు అనుమతులు మంజూరు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో నడిచే కోర్సులకు 2024 – 25 సంవత్సరానికి గాను "యుజిసి – డెబ్" అనుమతులు మంజూరు చేసింది. యుజిసి – డెబ్ గత 2022 సంవత్సరం నుంచి ఎస్వీయూ దూర విద్య కోర్సులకు అనుమతులు మంజూరు చేయలేదు. గత జనవరిలో డెబ్ నుంచి వచ్చిన ఎక్స్పర్ట్ కమిటీ యూనివర్సిటీ నందు మూడు రోజులపాటు సుదీర్ఘంగా పరిశీలించి యుజిసి కి నివేదిక సమర్పించింది. ఈ నివేదికను యుజిసి పరిశీలించి గురువారం ఎస్వీయూ దూరవిద్య కోర్సులకు 2024 – 25 సంవత్సరం నుంచి అనుమతులను మంజూరు చేసింది. దీని ప్రకారం 17 పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ అనుమతులు రావడానికి పనిచేసిన వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సంవత్సరం నుంచే దూరవిద్య కోర్సులకు ప్రకటన ఇవ్వనున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఎన్ సి రాయుడు, ఊక రమేష్, డా పాకనాటి హరికష్ణ, డా పత్తిపాటి వివేక్ తదితరులు విసి రిజిస్ట్రార్ లకు అభినందనలు తెలిపారు.




## గ్రావెల్ మాఫియాపై రెవెన్యూ నిఘా

### అరికట్టేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - రామచంద్రాపురం

మండలంలో వివిధ ప్రాంతాల నుండి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్( ఎర్ర మట్టి)ను తరలిస్తున్న వాహనాలను గురువారం రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న మట్టి మాఫియా కేటుగాళ్లు గ్రావెల్ టిప్పర్లను నిలిపివేశారు. నెత్తకుప్పం రెవెన్యూ పిల్లారకోన సమీపంలో ఓ చోటా వ్యక్తి గుట్ట పరంబోకు స్థలంలో హిటాచి ( భారీ యంత్రం) సహాయంతో గ్రావెల్ మట్టిని తోడేసి టిప్పర్ల ద్వారా తిరుపతికి తరలిస్తుండగా రామచంద్రాపురం రెవెన్యూ కార్యాలయం ముందు ప్రధాన రహదారిలో రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేశారు. నెత్తకుప్పంలో వీఆర్వో బాబు గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకుని అనుమతులు లేకుండా మట్టిని ప్రభుత్వ భూమిలో తోడినా....? టిప్పర్ల ద్వారా తరలించిన వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆర్సీపురంలో ఆ చోటా వ్యక్తికి చెందిన గ్రావెల్ టిప్పర్ ను పట్టుకున్నారు. ఆ టిప్పర్ వాస్తవానికి వైసిపి కి చెందిన ఓ వ్యక్తిది. కానీ ఆ టిప్పర్ పై ఈ చోటా వ్యక్తి పేరు రాసుకుని...... ఆ టిప్పర్ల ద్వారానే గ్రావెల్ను యదేచ్చగా అక్రమంగా తరలిస్తూ..... అమ్ముకుని..... జేబులు నింపుకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది తనిఖీలలో పట్టుబడిన ఆ చోట వ్యక్తి మట్టి టిప్పర్ను రెవెన్యూ అధికారులు వదిలేయమని రాజకీయ ఒత్తిళ్లు తెచ్చాడు. దీంతో రెవెన్యూ అధికారులు చిట్టచివరి హెచ్చరిక ఇచ్చి పంపించేశారు. దీంతో అక్రమ గ్రావెల్ రవాణా చేస్తున్న గ్రావెల్ మాఫియా నోటిలో గుటక్కాయ పడినట్లు అయింది. ఈ సందర్భంగా తహసిల్దార్ కె వెంకటరమణ మాట్లాడుతూ గ్రావెల్ క్వారీ అనుమతులు లేకుండా..... ప్రభుత్వ భూములు ఇష్టారాజ్యంగా మట్టిని తొవ్వి టిప్పర్లతో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రావెల్ అక్రమ రవాణా అరికట్టడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ తనిఖీలలో పట్టుబడితే వాహనాలు సీజ్ చేయడం, భారీ జరిమానాలు విధిస్తామని మైన్స్ అధికారులు తెలిపారు.





# వైభవం.. గౌరీ శంకర 'రథోత్సవం'

### • జనసంద్రమైన మాడవీధులు • భక్తుల ఆకలి, దప్పిక తీర్చిన దాతలు



యుటిఎఫ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ఓం నమ్మశివాయ'... 'హర హర మహదేవా శంభోశంకర'... అంటూ శివనామ స్మరణతో చతుర్మాడ వీధులు మార్మోగాయి. 'జైజై మాతా... జగన్మాతా' అంటూ జ్ఞాన ప్రసూనాంబను భక్తులు స్తుతించారు. చతుర్మాడ వీధుల్లో ఏ నోట చూసినా ఉమామహేశ్వరుల నామస్మరణే. జయజయ ధ్వానాల మధ్య శివ, పార్వతుల రథాలు ముందుకు సాగాయి.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏడోరోజైన గురువారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఉదయం 9గంటల నుంచే తేరువీధి, నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి భక్తులతో నిండిపోయాయి. సర్వాలంకార భూషితులైన గౌరీశంకరులు అలంకార మండపం నుంచి ఉదయం 10గంటలకే బయలుదేరి బిక్షాల గాలిగోపురం ముందు భాగాన ఉన్న రథాల వద్దకు చేరుకున్నారు. ఒక రథంపై గంగాదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరుడు, మరో రథంపై శంకరుని దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రథాలను అధిరోహించారు. రథాలపై ఆశీసులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 11.40గంటల ప్రాంతంలో స్వామివారి రథం బయలు దేరింది. స్వామివారి రథానికి ఉన్న మోకులను వందలాది మంది భక్తులు పట్టుకుని ముందుకు లాగారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆకాశాన్ని తాకే విధంగా ఉన్న స్వామి వారి రథం ముందుకు కదలుతుంటే భక్తులందరూ శివనామస్మరణ చేశారు. మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతంలో ముగిసింది. ఇక రథోత్సవం సందర్భంగా ఉప్పు, మిరియాలు చల్లుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ మిరియాలను తింటే కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అదేవిధంగా రథాలు కదిలే మార్గంలో ఇసుక చల్లారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఈవో బాపి రెడ్డి పాల్గొన్నారు. రామేశ్వరం ఎమ్మెల్యే ముత్తు రామలింగం గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

**ముక్కంటి క్షేత్రం భక్తజనసంద్రం**

శ్రీకాళహస్తి క్షేత్రంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు రథోత్సవం పురస్కరించుకుని వేలాది మంది తరలి వచ్చారు. పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఈ వేడుకలను తిలకించడానికి తరలి రావడంతో నాలుగు మాడవీధులు భక్తజన సంద్రంగా మారాయి. ఇక వందలాది మంది భక్తులు మాడవీధుల్లో మిద్దెల పైకి ఎక్కి రథోత్సవం తిలకించారు. కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు చోట్ల చైన్ స్నాచర్లు తమ హస్త లాగవాన్ని ప్రదర్శించారు. తొట్టంబేడు మండలంలోని కంచనపల్లికి చెందిన సుభాషిణి అనే మహిళ మెడలో సుమారు 3 సవర్ల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని వెళ్ళాడు. ఇలాంటి సంఘటనలు రథోత్సవంలో చాలానే జరిగాయి.



ఎస్‌బిఐ విరాళం

**భక్తుల ఆకలి, దప్పిక తీర్చిన దాతలు**

రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు పలు ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు ఆకలి, దప్పికలను తీర్చాయి. పెద్ద ఎత్తున మజ్జిగ, నీరు, నిమ్మరసం, అన్నదానం చేసి భక్తులు అలసిపోకుండా ముందుకు సాగేలా


సాయపడ్డాయి. యుటిఎఫ్ శ్రీకాళహస్తి డివిజన్ నేతల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, అన్నదానం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా సహాధ్యక్షురాలు ఈ గీతమ్మ, కోశాధికారి కే మోహన్ బాబు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, జిల్లా పూర్వసహాధ్యక్షులు సూర్య ప్రకాష్, జిల్లా సీనియర్ నాయకులు జి శ్రీనివాసులు, ఎం దామోదరం శెట్టి, వయ్యాల మధు, జిల్లా కార్యదర్శులు సి వెంకటకష్ణ, ఓ విజయ కుమార్, వై విజయశ్రీ, ఏ హేమాం బరధరరావు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలకు ఆర్థిక విరాళం**

బ్రహ్మోత్సవాల నిర్వహణకు శ్రీకాళహస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ గురువారం రూ.3 లక్షల ఆర్థిక విరాళాన్ని అందజేసింది. ఆ మొత్తాన్ని ఆ శాఖా మేనేజర్ పి. పయని కుమార్ చెక్కు రూపంలో ఈవో బాపిరెడ్డికి అందజేసింది.

**సాయి నాసిక వేణు గానామతం**

స్థానిక ధూర్జటి కళా ప్రాంగణంలో జరుగుతున్న సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. బుధవారం రాత్రి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయి హేమంత్ కష్ణ నాసికంతో చేసిన వేణు గానామతం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. నాసికకంతో వేణువు ఊది ఆలపించిన భక్తి గీతాలు విని భక్తులు తరించి పోయారు. సాయి హేమంత్ కష్ణకు నాసిక బ్రహ్మ అనే బిరుదుఉంది. ప్రదర్శన అనంతరం నిర్వాహకులు ఆయన్ను ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు.



భక్తజనసందోహంతో అలరించిన రథోత్సవం

## ఆప్కాస్ రద్దు నిర్ణయం వెనక్కు తీసుకోవాలి


వడ్డీపల్లి చెంగయ్య

**ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటి యు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతి జిల్లాలోని అన్ని ఆర్డిఓ కార్యాల యాల ముందు ధర్నా కార్యక్రమాలు చేపడతామని జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆఫ్కాస్ రద్దు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాల్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## క్రీడల్లో ఎస్‌పిడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు వివిధ జాతీయ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరందరినీ తిరుపతి జిల్లా విద్యాధికారి కెవిఎన్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరిదేవి, ఎస్జిఎఫ్ సెక్రటరీ ఎస్. సురేష్, నెల్లూరు వ్యాయామ ఉపాధ్యాయుడు జి. ప్రసాద్ విద్యార్థిలకు ప్రశంసా పత్రాలందించి ప్రత్యేకంగా శుభాభినందనలు తెలిపి, వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సాయి సుమతిని అభినందించారు. పశ్చిమబెంగాల్‌లో 68వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ 19 లో టి.సాయి, వై.గంగాభవాని, ఎస్ ధరణి, మీరుట్‌లో జరిగిన అండర్ 19 కుస్తీ పోటీల్లో ఆర్.లక్ష్మీ లావణ్య, కె.రెడ్డి జీవన, ఇ.సౌమ్య, 68వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ 17 లో నర్సింగాపూర్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో ఎమ్.లిఖిత, 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్ 19 లో జార్ఖండ్ అథ్లెటిక్స్ లో ఎస్.అమ్రిన్, 68వ స్కూల్ గేమ్స్ అండర్ 19 జూడో విభాగంలో పంజాబ్ లో జరిగిన జూడోలో ఎమ్.రేవతి, 68వ స్కూల్ గేమ్స్ పటియాలలో జరిగిన బాస్కెట్ బాల్ క్రీడల్లో వి.మోక్షలు విజేతలుగా నిలిచారు.

## స్టైఫండ్ పెంచండి


విద్యార్థులతో మాట్లాడుతున్న రామానాయుడు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థుల స్టైఫండ్ పెంచాలని, విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెకు గురువారం ఏపీ రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం సంపూర్ణంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్టైఫండ్ పెంచాలని, లేని పక్షంలో రైతు సంఘం, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర నాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు గోవిందస్వామి, నగర నాయకులు ఓం రాజ్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటి వద్దే పింఛన్ అందించాలి


ఎంపిడిఓ మహమ్మద్ రఫి

**ప్రజాశక్తి - పిచ్చా టూరు:** పిచ్చాటూరు మండలంలో పింఛను పంపిణీ చేయు అధికారులు లబ్దిదా రులకు ఇంటివద్దే అందించాలని గురువారం ఎంపిడిఓ మహమ్మద్ రఫీ ఒక ప్రకటనలో కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువలన వృద్దులు, వికలాంగులు, మహిళలకు ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. అందు బాటులో లేని పింఛనుదారులకు 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పింఛను పంపిణీ చేయదలచిన కారణాలు కూడా అధికారులు తమ మొబైల్ యాప్‌లో పొందు పరచాలన్నారు.

## అబ్దుల్ రహీంకు అభినందన


అబ్దుల్ రహీంను అభినందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు నియోజకవర్గంలో, 65 మసీదుల ముత వల్లి కమిటీలకు అధ్య క్షుడిగా ఎన్నుకోబడిన అబ్దుల్ రహీమ్‌ను గూడూరు మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ తరపున వెల్ఫేర్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు మహబూబ్ బాషా సెక్రెటరీ షేక్ శానవాజ్, అప్సర కరీముల్లాలు అభినందించారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ ఇమామ్, మౌసన్‌ల జీతభత్యాల విషయమై కృషి చేస్తానని తెలిపారు.

## భాస్కర్ రాజు మరణం తీరని లోటు


భాస్కర్ రాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బసవరాజు భాస్కర్ రాజు మరణం తీంని లోటని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ, ఒంటిమిట్టలో ఉన్న భాస్కర్ రాజు స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ నారాయణ బాబు, బాలసుబ్రమణ్యం రాజులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ గౌతం పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో గురు వారం నగర పరిధిలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, బీ సీనయ్య, కళ్యాణ సాయి, ఎం రూపేష్ రెడ్డి, మదనమేటి రమణయ్య, అక్కన రమణయ్య, క్లబ్ కార్యదర్శి కే శివయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్, జిల్లా అడిషనల్ సెక్రెటరీ హనుమం తరావు, పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'స్టూడెంట్' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభపై స్టూడెంట్ ప్రత్యేక సంచికను తిరుపతి ఎమరాల్డ్స్ కాలేజీలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఈ పుస్తకం అందరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. ఆశ, జిల్లా కన్వీనర్ స్రవంతి, కో – కన్వీనర్ స్రవంతి, కమిటీ సభ్యులు, విద్యార్థులు సభలో పాల్గొన్నారు.

# అంగన్వాడి.. సమస్యల ఒడి



**అది పసిపిల్లలు వచ్చే పాఠశాల. అప్పుడప్పుడే తల్లి ఒడి నుంచి, అంగన్వాడికి అడుగులేస్తున్న చిన్నారుల మొదటి బడి. కానీ అది నేడు సమస్యల దడిగా మారి చిన్నారుల పాలిట శాపంగా ఉంది. జయంపు, హరిజనవాడలో ఉన్న అంగన్వాడి పాఠశాల దుస్థితిపై ప్రజాశక్తి ఫోకస్.**

**ప్రజాశక్తి - బాలాయపల్లి :** సుమారు గత పది సంవత్సరాలుగా జయంపు పంచాయతీలో కమ్యూనిటి హాల్‌లో అంగన్వాడీ పాఠశాల నిర్వహిస్తున్నారు. ఈ హరిజనవాడలో అంగన్వాడీ పాఠశాల లేకపోవడంతో అప్పట్లో సర్పంచ్‌గా ఉన్న వెందోటి మధుసూధన్ రెడ్డి కృషిచేసి చిన్నారులకు కమ్యూనిటీ హాల్లో తాత్కాలికంగా అంగానాడీ పాఠశాల ఏర్పాటు చేయించారు. అంగన్వాడీ పాఠశాలకోసం ప్రత్యేకంగా స్థలం కేటాయింపు జరిగినా భవన నిర్మాణానికి నోచుకోలేదు. ప్రస్తుతం అంగన్వాడి స్కూలు పరిసరాలు మురికి కూపంగా మారింది. స్కూలు ప్రక్కనే చెత్త చెదారం, మురికి కాలువ నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. కీటకాలకు, దోమలకు అలవాలంగా మారింది. దీంతో చిన్నారులను పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చిన్నారుల ఆర్యోగ్యానికి భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు చిన్నారులకు అపరిశుభ్రతలోనే మధ్యహ్న భోజనం కూడా పెడుతున్నారు. పాఠశాలకు రావాలంటే మురికి కాలువ దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం చిన్నారులకు వేసే చాపల్లోంచి తేలు వచ్చి బాలికను కాటు వేసిన సంగతి తెలిసిందే. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనుల చేపట్టకపోవడంతో పాఠశాల పరిసరాలు చెత్త, కాలువ నీటితో అశుభ్రంగా తయారయ్యాయి. అధికారులకు ఎన్నిసార్లు వినతి సమర్పించినా ఫలితం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇకనైనా అధికారుల, పంచాయతీ సిబ్బంది స్పందించి అంగన్వాడీ పరిసరాలు శుభ్రపరచి, చిన్నారులకు ఆరోగ్య భద్రత, కీటకాల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



**మా పిల్లల చదువుకన్నా.. వారికి జ్వరాలు, ఇతర వ్యాధులు వస్తాయని కంగారు పడుతున్నాం. విష కీటకాలు అంగన్వాడీ బడిలో చేరుకున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉంది.**

\- అనిత, విద్యార్థుల తల్లి



**పిల్లలను అంగన్వాడికి పంపాలంటే భయంగా ఉంది. బడి చుట్టూ చెత్త, చెదారం, కాలువ మురికి ఉన్నాయి. మా పిల్లలకు దోమలు కుట్టి జ్వరాలు వస్తాయని ఆందోళన. కాలువ దాటాలంటే కూడా పిల్లలకు కష్టంగా ఉంటోంది.**

\- శాంతి, విద్యార్థుల తల్లి



**అంగన్వాడీ పరిసరాలు శుభ్రం చేయిస్తాం. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక భవనం ఏర్పాటుకు కృషి చేస్తాం.**

\- దట్టం చిన్న సిద్దయ్య, సర్పంచ్

# క్రైం న్యూస్

## రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి


ప్రమాద దృశ్యం, మృతి చెందిన వ్యాన్ డ్రైవర్ వెంకటేష్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు, ఆదిశంకర కళాశాల సమీపంలో జాతీయరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు చెందిన వెంకటేష్(45) అనే వ్యక్తి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం నెల్లూరు వైపు నుంచి నాయుడుపేటకు ఆటోలో వెళ్తున్నాడు. స్థానిక ఆదిశంకర కళాశాల సమీపంలో నెల్లూరు వైపు నుంచి నాయుడుపేటకు వెళుతున్న ఓలారీ రోడ్డు పక్కగా ఆగిఉంది. వ్యాన్ అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొనింది. వ్యాన్ డ్రైవర్ వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి, విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

## వికృతమాల చెరువులో మహిళ మృతదేహం


మృతి చెందిన నవనీత

**ప్రజాశక్తి- ఏర్పేడు :** ఏర్పేడు మండలం మర్రి మంద బీసీ కాలనీకి చెందిన కరివెళ్ల రామ్మూర్తి భార్య నవనీత (40) ఫిబ్రవరి 26 తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన భర్త సంపాదనంతా తాగుడుకి ఖర్చుపెట్టి ఇంటిని పట్టించుకోలేదని, విరక్తి చెంది ఇంటి నుండి వెళ్లిపోయినది. మరుసటి రోజు మధ్యాహ్నం వికృతమాల గ్రామస్తులు చెరువులో నవనీత చనిపోయి మృతదేహం తేలుతున్నదని పోలీసులకు తెలిపారు. ఏర్పేడు సిఐ సూచన మేరకు ఏఎస్ఐఎస్ హబీబ్ ఉల్లా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కొరకు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మద్యం దుకాణం ఇక్కడ వద్దు సారూ..



తిరిగి తెరవాలనుకుంటున్న షాపు


ఈశలాపురం, తిరుపతి సర్కిల్


షాపు వెనుక రైల్వే ట్రాక్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** మద్యం దుకాణాలు ఎక్కడపడితే అక్కడ పెట్టడం ప్రమాదాలకు కారణమవుతోంది. రాచపాలెం ఊరి ముందర రద్దీగా ఉండే రోడ్డు పక్కన మద్యం దుకాణం తెరిచే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క రైల్వే ట్రాక్, మరోపక్క ఈశలాపురం, తిరుపతికి వెళ్లే రహదారుల సర్కిల్, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పడితే, మద్యం ప్రియులు తూలుతూ తిరుగుతూ తిరగడం ప్రమాదాలకు కారణమవుతోంది. గతంలో ఆప్రాంతంలో మద్యం దుకాణం ఉండేది. స్థానికులు, మహిళలు అధికారులకు మొరపెట్టుకుని తీయించేశారు. కానీ మళ్లీ అదే షాపు ప్రారబించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి అక్కడ మద్యం దుకాణం ఏర్పాటును ఆపాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## హోమియోపతి విద్యార్థుల ప్రతిభ


మెడల్స్ చూపుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఏఎస్ఆర్ హోమియోపతి మెడికల్ కాలేజీ తాడేపల్లిగూడెంలో నిర్వహించిన (ఆయుష్) ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్ లో కేకేసి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 400,200,100 మీటర్ల పరుగు పోటీలలో, రిలే పరుగు పోటీలలో విద్యార్థులు విజయం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ నరసింహారావు, రవి శేఖర్, అధ్యాపకులు డాక్టర్ శరవనన్‌లు విద్యార్థులను అభినందించారు. ఈ పోటీలకు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ నానకు నాయక్‌లు ప్రాతినిధ్యం వహించారు.

## ఎంపీడీవో కార్యాలయ భవనానికి మరమ్మతులు

**ప్రజాశక్తి- ఏర్పేడు :** ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం దాదాపు 40 ఏళ్ళ క్రిందట నిర్మించిన భవనం కావడంతో సీలింగ్ పెచ్చులు ఊడి వర్షాకాలంలో ఉరుస్తోంది. దీంతో ఫైళ్ల తడిసిపోవడం వంటి సమస్యలతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పేడు జడ్పిటిసి డాక్టర్ కావేరి తిరుమలయ్య ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు 20 లక్షల రూపాయలు జడ్పీ నిధులను మంజూరు చేశారు. భవన మరమ్మతు పనులను పంచాయతీరాజ్ డి.ఇ వెంకట వినోద్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఏర్పేడు పిఆర్ ఇంచార్జ్ ఏఈ రవితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాధిక్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

## సామ్‌సంగ్ సరికొత్త సర్వీస్ సెంటర్ ప్రారంభం




**ప్రజాశక్తి -తిరుపతి సిటీ :** శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, స్మార్ట్‌ఫోన్ కస్టమర్ సర్వీస్ అనుభవాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి సేవా కేంద్రాలను సమూలంగా పునరుద్ధరిస్తోందని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సునీల్ కుటిన్హా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రీమియం కస్టమర్ కేర్ మీద దృష్టి సారించి, అమ్మకాల తర్వాత అత్యుత్తమైన మద్దతుకు శామ్‌సంగ్ నిబద్ధతను బలోపేతం చేస్తూ, సజావు సర్వీస్–టు–సేల్స్ ప్రయాణాన్ని సాగిస్తున్నామన్నారు. శామ్‌సంగ్ తన సేవా కేంద్రాలను ఇంటిగ్రేటెడ్ ఓమ్ని–ఛానల్ అనుభవానికి అనుగుణంగా పునర్నిర్మించింది. ఇందులో అంతర్నిర్మిత వైర్‌లెస్ ఛార్జింగ్ స్టేషన్లు, ఖరీదైన సోఫా–శైలి సీటింగ్ ఉంటాయి, వినియోగదారులు మరింత ఆహ్లాదకరమైన అనుభవాన్ని పొందగలరని తెలిపారు. శామ్‌సంగ్ ప్రస్తుతం ఫిజికల్ సర్వీస్ సెంటర్లు, రెసిడెంట్ ఇంజనీర్లు, కలెక్షన్ పాయింట్లతో సహా భారతదేశం అంతటా 3వేలకు పైగా సర్వీస్ టచ్ పాయింట్లను నిర్వహిస్తోంది. సర్వీస్ సెంటర్ పున్ణరూపకల్పన ప్రారంభించడం కీలక నగరాల్లో దశలవారీగా అమలు చేయబడుతుంది, ఇది దేశవ్యాప్తంగా మెరుగైన కస్టమర్ అనుభవాన్ని నిర్ధారిస్తుందని వినియోగదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 14న కుమారధార తీర్థ ముక్కోటి

**ప్రజాశక్తి - తిరుమల:** మార్చి 14వ తేదిన తిరుమలలో జరగనున్న కుమారధార తీర్థ ముక్కోటి పై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి గురువారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుమారధార తీర్థ ముక్కోటికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 14వ తేది ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే భక్తులను కుమారధార తీర్థానికి అనుమతిస్తామన్నారు. అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వద్దుల శ్రేయస్సును దష్టిలో ఉంచుకుని అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతించమని తెలిపారు. పాపవినాశనం నుండి కుమారధార తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్గమధ్యంలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని, అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాపవినాశనం డ్యామ్ వద్ద ఉదయం 6 గంటల నుండి భక్తులకు పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంజినీంగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన షెడ్లు, మార్గమధ్యంలో నిచ్చెనలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందితోపాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

## రేపు జీ తెలుగులో 'సంక్రాంతికి వస్తున్నాం'

**తిరుపతి టౌన్ :** వరుస సూపర్‌హిట్ సినిమాలు, సరికొత్త కాన్సెప్ట్‌లతో ఫిక్షన్, నాన్ఫిక్షన్ షోలతో అలరిస్తున్న జీ తెలుగు మరో ట్రిపుల్ బొనాంజా ఎంటర్టైన్మెంట్తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ ఏడాది సంక్రాంతి బ్లాక్‌బ్లస్టర్‌గా నిలిచిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేసేందుకు సిద్దమైంది.

## విలేకరి వెంకటేష్‌కు మాతృ వియోగం


నీలమ్మ (ఫైల్ ఫోటో)

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** ప్రజాశక్తి శ్రీకాళహస్తి రూరల్ విలేకరి కావేరిపాకం వెంకటేష్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి కావేరిపాకం నీలమ్మ(78) గురువారం ఆనారోగ్యంతో ఆకస్మిక మృతి చెందారు. ఆమె మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు గంధం మణి, గురవయ్య, ప్రజాశక్తి మేనేజర్ సిఎస్ ప్రసాద్, డెస్క్ ఇన్‌ఛార్జి ఎ.వనజ, బ్యూరో వి.గోపి, డివిజన్ ఇన్‌ఛార్జి కిషోర్‌లు నివాళి అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నీలమ్మ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం పూసల వీధిలోని యూసఫ్ మసీదు వద్ద జరుగుతాయి.

## 'సిటీ ఆపరేషన్ సెంటర్' త్వరగా పూర్తి చేయండి


సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** స్మార్ట్ సిటీ నిధులతో అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పాత మునిసిపల్ కార్యాలయం స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్థులలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ.రవి, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్ ఉన్నారు.

## 'ఏ బిలియనీర్స్ ఒడిస్సీ' ప్రత్యేక గాలా నైట్

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్ :** గత ఏడాది సాధించిన విశేష విజయాలు, ఈ ఏడాది కంపెనీ పదో వార్షికోత్సవ ప్రణాళికలతో వీటీ మార్కెట్స్ 'ఏ బిలియనీర్స్ ఒడిస్సీ' అనే ప్రత్యేక గాలా నైట్ నిర్వహించింది. ఈ ప్రఖ్యాత కార్యక్రమం థాయ్లాండ్లోని బ్యాంకాక్లోని సియామ్ కెంపిన్స్కీ హెూటల్, ఛంద్ర బాల్రంలో జరిగింది. ప్రముఖ క్లయింట్లు, భాగస్వాములు, పరిశ్రమ నాయకులు ఈ వేడుకకు హాజరై వీటీ మార్కెట్స్ విజయవంతమైన ఏడాదిని గుర్తు చేసుకున్నారు. వ్యాపార అభివద్ధి విభాగం ప్రతినిధి మౌరీ ముర్గియోని మాట్లాడుతూ గత ఏడాది వీటీ మార్కెట్స్ అనేక విజయాలు సాధించిందన్నారు. వీటిలో ట్రేడింగ్ వాల్యు మ్లో 150 శాతం వద్ధి, గ్రాస్ డిపాజిట్లు, తొలి ట్రేడింగ్లలో రెట్టింపు వద్ధి వంటివి ఉన్నాయన్నారు. 2025లో ఎదుగుతున్న మార్కెట్లు, కొత్త ఆర్థిక సాధనాలపై ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలు తెలిపారు.

## కేన్సర్‌పై అవగాహన

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం, శ్రీ వేంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్డ్ రీసర్చ్, టాటా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కొప్పర వాండ్లపల్లి, పెరుమాళ్ళపల్లి పంచాయితీలో గ్రామస్థులకు, చుట్టుప్రక్కల గ్రామస్థులకు వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డిఈఓ మహేంద్ర, మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ కె .హైమావతి, ప్రాజెక్ట్ అసిస్టెంట్స్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, వి.ప్రీతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ :** నాయుడుపేట మండలం, అన్నమేడులో ఫిబ్రవరి 26వ తేదీ నుండి మార్చి 6 తేదీ వరకు 9 రోజులు పాటు చెన్నై శంకర నేత్రాలయ వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వ హించి, శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్లు చేసి, కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతోందని నిర్వహుకులు తెలిపారు. ఈ అవకా శాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్స్ పద్మనాభయ్య, సన్నారెడ్డి విజయ్ మోహన్ రెడ్డిలు కోరారు.

## శ్రీ శక్తి పీఠంలో తెలంగాణ మంత్రి


శ్రీ శక్తి పీఠం పీఠాధిపతుల ఆశీర్వాదం పొందుతున్న తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాశక్తి - రామచంద్రపురం :** రాయలచెరువు, శ్రీ శక్తి పీఠాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం సందర్శించారు. శ్రీ శక్తి పీఠం ప్రధాన కార్య నిర్వహణాధికారి శశిభూషణ్, అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పీఠ అర్చకులు మంత్రి తుమ్మలకు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నారావారిపల్లి సమీపంలో ఉన్న టీటీడీ అనుబంధ దేవాలయమైన శ్రీ శేషాచల లింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటేష్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## శివాలయం ప్రారంభం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** మహా శివరాత్రి విశేష పర్వదినం సందర్భంగా టీటీడీ నిర్వహణలోని స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వితరణతో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. ప్రియవర్ధన బాబు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలే మా లక్ష్యం: కెనరా బ్యాంక్ జిఎం


నూతన కెనరా బ్యాంకు బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న ◄ జీఎం పాండురంగ మితంతాయ

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేస్తామని బ్యాంక్ తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతాయ పేర్కొన్నారు. గురువారం తిరుపతి, ఎమ్ ఆర్ పల్లి లక్ష్మీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకు కుటుంబం ఆర్థిక అభివృద్ధికి చేయూతనిచ్చే పథకాలను ఖాతాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కార్యాలయం ఏజీఎం నాగరాజరావు, డివిజనల్ మేనేజర్లు శరవణ కుమార్, సువర్ణ కృష్ణ, హర్ష బ్యాంకు సీనియర్ మేనేజర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## దువ్వాడ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ప్రతిపక్ష హోదా కావాలని వైసిపి నాయకులు సభలో గందరగోళం చేయడం హేయమైన చర్య అని, పవన్ కళ్యాణ్‌పై నిరాధార ఆరోపణలు చేసిన దువ్వాడ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ, పట్టణ పార్టీ నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని, తిరుపతి పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, కార్యదర్శి రాజేష్ ఆచారి, హేమ కుమార్, రాజా మోహన్, సుమన్ బాబు, మునుస్వామి, ఆనంద్, రమేష్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## టెన్నిస్ బాల్ క్రికెట్ కెప్టెన్‌గా కృష్ణారెడ్డి

**ప్రజాశక్తి - రామచంద్రపురం ( చంద్రగిరి )** జాతీయ స్థాయి అండర్ 17 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కి కెప్టెన్ గా సముద్రాల ధన శేఖర్‌ను ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ టెక్నీస్, క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ పగడాల సురేష్ తెలిపారు. ఇటీవల చంద్రగిరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్షిప్‌లో కృష్ణారెడ్డి శ్రీ చైతన్య విద్యార్థి సముద్రాల ధన శేఖర్ అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు ఎస్ వసంతయ్య, లిఖిత దంపతులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ అభినందన తెలిపారు.

## జిల్లాకు ఎరువుల సరఫరా పెంచాలి : ఎంపి

**తిరుపతి టౌన్ :** 2025–26 ఖరీఫ్, రబీ సీజన్‌కు ఎరువుల సరఫరా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపి గురుమూర్తి కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లకు లేఖ రాశారు. 2024–25 వ్యవసాయ సంవత్సరంలో 1,19,141 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించబడ్డాయని తెలిపారు. రైతుల అవసరాలను, పెరుగుతున్న వ్యవసాయ అవసరాలను దష్టిలో ఉంచుకుని 2025–26 సంవత్సరానికి 25% పెరుగుదల అంటే 1,54,131 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా అవసరమని తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం 258 ప్రైవేట్ డీలర్లు, 36 వ్యవసాయ సహకార సంఘాలు ఎరువుల పంపిణీలో ఉన్నాయని, పెరుగుతున్న వ్యవసాయ విస్తరణకు అనుగుణంగా డీలర్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు.